ప్రతిఒక్కరికీ కార్పొరేట్ తరహా వైద్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభిచిన ఎమ్మెల్యే
- సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచన




పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మాజీ జేడీ లక్ష్మీనారాయణ,వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శ్రీశైలం: ప్రతి పేదవాడికీ కార్పొరేట్ తరహా వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీశైలంలోని హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ డాక్టర్లు విజయ్ భార్గవ్, ఝాన్సీ, జె.స్రవంతి తదితరులు హాజరై దాదాపు 776 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. వంద మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. డాక్టర్లు ఎమ్మెల్యే శిల్పా, మాజీ జేడీ లక్ష్మీనారాయణకు కూడా బీపీ చెక్ చేశారు. అనంతరం వారు పలువురికి మందులు అందజేశారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కరోనా కాలం నుంచి చిన్న వయస్సు వారు సహితం గుండెపోటుతో మృతిచెందుతుండటం గమనించిన ముఖ్యమంత్రి.. మరిన్ని మరణాలు చోటుచేసుకోకూడదనే ఉద్దేశంతో ఆరోగ్య సిబ్బందిని ఇంటింటికి పంపి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారన్నారు. అవసరమైన వారికి టోకెన్లు ఇచ్చి వైద్య శిబిరానికి రప్పించి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండయ్య యాదవ్, భరత్‌రెడ్డి, వట్టి వెంకటరెడ్డి, రజాక్, టీఎమ్ రఫీ, రబ్బాని, జిలానీ, అంగన్‌వాడీ సూపర్ వైజర్, ఆశావర్కర్లు, సీహెచ్‌ఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

తూడిచెర్ల గ్రామంలో..

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు యశస్విని, శారద, గంగాధర్, తిరుపతి హాజరై 712 మందికి పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 30 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి కర్నూలుకు రెఫర్ చేశారు. 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ బాలమద్దిలేటి, ఎంపీటీసీ నాగమణి, జేసీఎస్ నాయకుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ తిరుమలేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరమణ, ఎంపీడీఓ నూర్జహాన్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలు శుక్రవారంతో ముగియడంతో డాక్టర్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. అనంతరం అధికారులను వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు.

మహానందిలో..

మహానంది: ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రతి ఒక్కరికి ఆరోగ్యాన్ని చేకూర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానందిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాపురం, గాజులపల్లె వైద్యులు శాంతిప్రియ, వెంకటరెడ్డి హాజరై 552 మందికి వైద్య సేవలు అందించారు.అవసరమైన వారికి మందులు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో సర్పంచ్ చలంచలం శిరీష, ఎంపీటీసీ సభ్యుడు బంగి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, డీటీ సత్యశ్రీనివాసులు, నాయకులు సాంబిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్ఈఏఎస్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

పగిద్యాల: వచ్చే నెల 3న నిర్వహించనున్న ఎస్ఈఏఎస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అసిస్‌మెంట్ సర్వే) పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని మండల విద్యాధికారి సుభాన్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ప్రాక్టీస్ పరీక్షను ఆయన పరిశీలించారు. ఎంఈఓ వెంట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుజనకుమారి, లెక్చరర్ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు ఉన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం -1 పరిధిలో గుండుతూము పాఠశాల ఆవరణంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ప్రజలు హాజరై వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సులు

మహానంది: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి మంజూరు అయిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బండిఆత్మకూరు మండల ఏపీఓ వసుధారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే అవగాహన, పండ్ల తోటల పెంపకంపై మెలకువలు, శిక్షణ కార్యక్రమానికి ఉద్యానశాఖ అధికారి హరినాథరెడ్డి హాజరవుతారన్నారు. దీంతో పాటు మహానంది మండలంలోని మహానంది, గాజులపల్లె గ్రామాల్లో రైతులకు పండ్ల తోటల పెంపకం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితాలు

మహానంది: రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు, ఈకేవైసీ జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మసీదుపురం గ్రామంలోని ఆర్‌బీకేల్లో ఖరీఫ్-2023 పంట నమోదు కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 29 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. అలాగే పంట నమోదుపై గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ప్రతి రైతు పంట జాబితా తనిఖీ చేసుకొని విస్తీర్ణంలో లేదా, ఇతర పొరపాట్లు ఉంటే చూసుకుని సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



పాలక మండలి సభ్యురాలికి సన్మానం చేసిన దృశ్యం

నందికొట్కూరు: రాయలసీమ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలిగా ఎన్నికైన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీతను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు, శుక్రవారం ఘనంగా సన్మానించారు.

క్రికెట్ విజేత మార్కెట్ రాకెట్స్



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు

శ్రీశైలంప్రాజెక్ట్: రాజశేఖర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మార్కెట్ రాకెట్స్ టీం విజేతగా నిలిచింది. కొద్ది రోజులుగా శ్రీశైలం ప్రాజెక్ట్‌లో జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 36 టీంలు తలపడ్డాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీశైలం బుల్లెట్స్ టీంపై మార్కెట్ రాకెట్స్ టీం విజయం సాధించింది. నల్లమల టైగర్స్ టీం మూడోస్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు నిర్వాహకులు కప్‌లను అందజేశారు.

కేంద్రంలో బీజేపీని గద్దెదింపాలి

జూపాడుబంగ్లా: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరముందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక సంపదను, ప్రభుత్వ రంగసంస్థలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందన్నారు. సమస్య పరిష్కారం కోరుతూ ఈనెల 31న చేపట్టనున్న సీపీఎం బస్సుయాత్రకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు కర్ణ, నరసింహ, ఏసన్న, శివప్రసాద్, దేవరాజ్, మౌలాలి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి



దసరా కానుకగా దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, పక్కన దేవస్థానం ఏసీ, ఏఈఓ, పర్యవేక్షకులు

శ్రీశైలం: పారిశుధ్య, హౌస్‌కీపింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గంగా-గౌరీ సదనం వద్ద శ్రీశైల దేవస్థానంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్య, హౌస్‌కీపింగ్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఏజెన్సీ ద్వారా కనీస వేతనం అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇతర సమస్యలను దేవదాయశాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం దసరా కానుకల్లో భాగంగా కార్మికులకు దుస్తులు అందజేశారు. సమావేశంలో దేవస్థానం ఏసీ వెంకటేష్, ఏఈఓ మోహన్, పర్యవేక్షకులు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండయ్య యాదవ్, రజాక్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి చందన

మిడుతూరు: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి చందన సూచించారు. శుక్రవారం మిడుతూరు పరిధిలో సాగైన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, జామ, చీనీ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, చింత పంటలతో పాటు పూల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ప్రయాణికులు ఆర్టీసీ బస్సు కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలు-నంద్యాల సర్వీసుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన ప్రయాణికులు టికెట్ వెనుకభాగంలో పేరు, సెల్ నంబర్ రాసి బాక్సులో వేయాలన్నారు. డిపో పరిధిలోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన



ఓపెన్ హౌస్‌లో ఆయుధాల పరిచయం

ఆత్మకూరురూరల్: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు పాఠశాలల విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణం, ఎస్‌ఐలు క్రిష్ణమూర్తి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

- రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులు మృతి



మృతి చెందిన డేవిడ్(ఎర్ర టీషర్టు), కరీం

మహానంది: విహారయాత్రలకు మిత్రులంతా కలిసి వచ్చారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి దర్శనం ముగించుకుని అందరూ మధ్యలో భోజనాలు చేసి సరదాగా కబుర్లు చెప్పుకుని బయల్దేరారు. ఐదు బైకులపై సుమారు పది మంది మహానందికి వస్తుండగా బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామ సమీపంలోని ప్రభాత్ కాలేజీ వద్ద ఎదురుగా వస్తున్న ఓ బైకు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బండిఆత్మకూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన కరీం, రఫీ, మస్తాన్‌తో పాటు మరికొంత మంది యువకులు విహారయాత్ర నిమిత్తం బైకులపై గురువారం శ్రీశైలం చేరుకున్నారు. అక్కడ దర్శనం ముగించుకుని మహానంది వెళ్తుండగా ప్రభాత్ కాలేజీ సమీపంలో కరీం(22) బైక్.. ఎదురుగా వస్తున్న వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన డేవిడ్(26) బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

నీటిని వృథా చేయొద్దు



తెలుగగంగ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటరమణయ్య

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా రైతులు పొదుపుగా వాడుకోవాలని ఆ శాఖ ఎస్‌ఈ వెంకటరమణయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో తెలుగుగంగ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా ప్రభుత్వం వారబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తుందన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, అయితే ఆ నీటిని ఉప ప్రధాన కాల్వలకు తగిన మోతాదులో విడుదల చేసి 500 క్యూసెక్కుల నీటిని గండ్లేరు రిజర్వాయర్‌కు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. నవంబర్ 4వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈఈ శంకర్‌రెడ్డి, డీఈఈలు చంద్ర ఓబుళరెడ్డి, శరత్‌కుమార్,ఏఈఈలురామశేషు, రాజు, సుబ్బారావు ఉన్నారు.

ఉచిత సామూహిక చండీహోమం



చండీహోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



చండీహోమంలో పాల్గొన్న తెల్లరేషన్‌కార్డు కలిగిన భక్తులు

శ్రీశైలం : శ్రీశైలదేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత సామూహిక సేవలలో శుక్రవారం చండీహోమాన్ని నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సామూహిక సేవలలో చంద్రవతి కల్యాణ మండపంలో చండీశ్వర హోమం నిర్వహించారు. ముందుగా భక్తులందరి గోత్రనామాలతో సంకల్పం జరిపించి, అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ, చండీహోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులందరికీ అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ ద్వారా స్వామివార్ల దర్శనం కల్పించారు. సేవాకర్తలకు రెండు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థాన అన్నపూర్ణ భవనంలో భోజన సదుపాయం కల్పించారు. కాగా శుక్రవారం జరిగిన సామూహిక చండీహోమంలో స్థానికులే కాకుండా నంద్యాల, కర్నూలు, మార్కాపురం, తెనాలి, తిరుపతి, బాపట్ల, అనంతపురం, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు కూడా పాల్గొన్నారు.

కొడుకును చంపిన కేసులో తండ్రి అరెస్ట్

వెలుగోడు: మద్యానికి బానిసైన కుమారుడిని కడతేర్చిన తండ్రి రామకృష్ణను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మృతుడు శ్రీనివాసులు తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు శిరివెళ్ల రామకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన రామకృష్ణ తన కుమారుడు మద్యానికి బానిసై వేధిస్తుండటంతో ఈ నెల 24న టవల్ గొంతుకు బిగించి హత్య చేశాడు. కేసులో దర్యాప్తు అధికారి ఆత్మకూరు సర్కిల్ నాగభూషణ్ శుక్రవారం రామకృష్ణను పట్టణ శివారులోని డిగ్రీ కాలేజీ వద్ద అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు బలవన్మరణం



మృతిచెందిన అబ్దుల్ రజాక్

కొత్తపల్లి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని నందికుంట గ్రామానికి చెందిన రైతు పింజరి అబ్దుల్ రజాక్ (38) మూడెకరాల సొంత పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని మినుము, మొక్కజొన్న సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. రెండేళ్లుగా పంటలు కలిసి రాకపోవడంతో నష్టం వాటిల్లింది. దీంతో అప్పు తీర్చే దారిలేక గురువారం రాత్రి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త ఎంతకూ ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉండటం చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య మౌలాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హుస్సేన్‌బాషా తెలిపారు.

ఊదిబత్తీల విక్రయ కాంట్రాక్టరుకు జరిమానా

మహానంది: మహానందిలోని ఊదిబత్తీల విక్రయ టెండరుదారుడు రమేష్‌రెడ్డికి జరిమానా విధించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల దసరా నవరాత్రి ఉత్సవాల రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా తన వాహనాలను ముఖద్వారం దాటి రాజగోపురం వరకు తీసుకొచ్చి పూజలను చేయించడం విమర్శలకు దారి తీసింది. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట నమోదు వివరాలు సరిచూసుకోండి



జాబితాను చూసుకుంటున్న రైతులు

వెలుగోడు: రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్-2023 పంట వివరాలను సోషియల్ ఆడిట్ కోసం ప్రదర్శించారని, వివరాలు సరిగా ఉన్నాయో లేదో రైతులు పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని మోత్కూరు, వెలుగోడు గ్రామాల్లో జొన్న, మినుము పంటలను ఏఓ పరిశీలించారు. పంటల స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట నమోదు పూర్తి అయిందని, రైతుల జాబితా ఈ నెల 27 నుంచి 29 వరకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రతి రైతు చూసుకొని పేరు, విస్తీర్ణం, పంట, నీటి వసతి ఇతర ఏమైన పొరపాట్లు ఉంటే గ్రీవెన్స్ రూపంలో అర్జీ అందజేసి రైతు భరోసా సిబ్బందికి తెలియజేసి సరిచేసుకోవాలని తెలిపారు. అన్ని గ్రామాలలో సోషల్ ఆడిట్ జరిపించాలని వ్యవసాయ విస్తరణ సిబ్బందికి ఆదేశించారు.

ఈక్రాప్ బుకింగ్ వందశాతం పూర్తి

జూపాడుబంగ్లా: ఖరీఫ్ సీజన్‌కు గాను ఈక్రాప్ బుకింగ్ వందశాతం పూర్తి కాగా ఈకేవైసీ 98 శాతం పూర్తిచేసినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాప్, ఈకేవైసీ పూర్తైన రైతుల జాబితాను గ్రామసచివాలయాల్లో పొందుపర్చినట్లు తెలిపారు. రైతులు వాటిని పరిశీలించుకొని వాటిల్లో ఏమైనా తప్పొప్పులుంటే తెలియజేస్తే వాటిని సరిచేస్తామని ఏఓ తెలిపారు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 25వేల ఎకరాలు కాగా 23,985 ఎకరాల్లో పలురకాల పంటలు సాగుచేసినట్లు తెలిపారు. సాగుచేసిన 23,450 ఎకరాల్లోని పంటలను ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయగా కేవలం 203మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గినట్లు జిల్లా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని సిద్దాపురం గ్రామ పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం పోలీసులు సోదాలు నిర్వహించి నాటుసారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. రెండు వేర్వేరు పాయింట్లలో పోలీసు సిబ్బంది 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా బట్టీలు నిర్వహించే వారి కోసం గాలింపు చేపట్టారు. నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. సోదాల్లో సీఐ నాగభూషణం, ఎస్‌ఐలు క్రిష్ణమూర్తి, నారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా 5కే రన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

బొమ్మలసత్రం: సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ 75వ వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల పట్టణంలో ఫిట్‌నెస్-75 5కే రన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శరీర దృఢత్వానికి పరుగు ఎంతో మేలు చేస్తుందని ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో పరుగును ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందికి, సాధారణ పౌరులకు పరుగు పందెం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన పరుగు పందెం పోగాకు గోడౌన్, ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్ మీదుగా తిరిగి కళాశాల వరకు సాగింది. పోటీలో గెలుపొందిన వారికి వరుసగా రూ.1500, రూ. వెయ్యి, రూ.500 అందజేశారు. పోలీస్ మెన్‌లో వేణుగోపాల్, సుధాకర్, సుదర్శన్, పోలీస్ ఉమెన్‌లో ఖాజాబీ, సబీనా, పద్మావతి, సాధారణ పౌరుల్లో కిషోర్, వెంకటసునీల్, నాని బహుమతులు గెలుచుకోగా వారికి బహుమతులు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ రంగముని, నంద్యాల టౌన్ సీఐలు ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, రవీంద్ర, దస్తగిరి పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

మహానంది/కొత్తపల్లి: మహానంది మండలంలోని ఓంకారం సిద్ధేశ్వరస్వామి, కొత్తపల్లి మండలంలోని శివపురం సమీపంలో ఉన్న కొలనుభారతి దేవి ఆలయాలను శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మూసి వేయనున్నారు. ఓంకారం ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగప్రసాద్, కొలనుభారతి దేవి ఆలయ పురోహితులు శ్రీనివాసశర్మ వేర్వేరుగా మాట్లాడుతూ రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలను మూసి వేసి తిరిగి 29న ఉదయం 6 గంటల నుంచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనం కల్పిస్తామని, భక్తులు గమనించాలని కోరారు.

వచ్చే నెల 4న సర్వ సభ్య సమావేశం

నందికొట్కూరు: వచ్చే నెల 4న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ శుక్రవారం తెలిపారు. మండల అధ్యక్షురాలు తొగురు సరోజిని వర్ధినియా అధ్యతన నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

అమరుల స్మరణే 'నామట్టీ-నాదేశం'

నందికొట్కూరు: అజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నామట్టీ నాదేశం కార్యక్రమం శుక్రవారం చేపట్టమని మున్సిపల్ కమిషనర్ పి.కిశోర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని మట్టిని సేకరించి టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్యకు అప్పగించామన్నారు. ఆయన ద్వారా ఆ మట్టిని ఢిల్లీకి పంపించామన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిన సందర్భంగా దేశం కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ నామట్టీ-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.